క్లుప్తంగా

బోనాల ఉత్సవాల్లో ప్రభుత్వ విప్



వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని కొనాయపల్లిలో లక్కమారు మున్నూరు కాపులు బుధవారం నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు పండాలని, ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆయన వేడుకున్నారు.

సూచికలు లేకనే ప్రమాదాలు



మాట్లాడుతున్న రాజగోపాల్

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సూచికలు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రెడ్ క్రాస్ సంస్థ పెద్దపల్లి శాఖ అధ్యక్షుడు కావేరి రాజగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జంక్షన్ల వద్ద సరైన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిచ్చి సూచికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్, మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నియామకం

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన కోయినేని బాలయ్యను రాష్ట్ర మున్నూరుకాపు సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య బుధవారం నియమించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు బాలయ్యను ఘనంగా సన్మానించారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని బాలయ్య పేర్కొన్నారు.

ఘనంగా సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణులు

తంగళ్లపల్లి: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మెట శ్రీనివాస్‌ను మండెపల్లి గ్రామ నాయీ బ్రాహ్మణులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం సభ్యులతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతును ఆదుకోవాలి



పరామర్శిస్తున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట పరిధి కిష్టునాయక్ తండాకు చెందిన గిరిజన రైతు మాలోత్ హన్మంత్‌నాయక్ కోళ్ల ఫాం షెడ్డు ఈదురుగాలులతో పూర్తిగా ధ్వంసమైంది. బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య షెడ్డును పరిశీలించి బాధిత రైతును పరామర్శించారు. అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాయకులు నమిలికొండ శ్రీనివాస్, నర్సింలు, తోకల శివారెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యపాల్‌రెడ్డి, శరత్‌బాబు, ద్యాప రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

భూసారంతోనే అధిక దిగుబడి

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బుధవారం ఎరిస్ ఆగ్రో కంపెనీ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసారంతోనే మేలైన పంటలు సాగు అవుతాయన్నారు. భూసార పరీక్ష ఆధారంగానే రైతులు పంటలకు ఎరువులను వాడాలని సూచించారు. డెవలప్‌మెంట్ అధికారిరాజు, టి.శ్రీనివాస్, రాజిరెడ్డి, అనిల్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ నంది కమాన్ ప్రాంతంలో వేములవాడ–సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి రెండ్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. సంకెపల్లికి చెందిన అర్వింద్, మల్లారం గ్రామానికి చెందిన నితిన్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

కట్ట పొడవునా పగుళ్లే..

- నెర్రెలు బారిన బండపల్లి చెరువుకట్ట
- వర్షాకాలంలో పొంచివున్న ముప్పు
- కూలిపోయిన కాలువలు
- మరమ్మతు చేపట్టాలని విజ్ఞప్తి



నెర్రెలు తెరిచిన బండపల్లి చెరువుకట్ట



ముళ్ల పొదలతో నిండిన కాలువ

చందుర్తి : రైతులకు సాగునీటి కష్టాలు తీర్చాలని ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నిర్మాణం చేపట్టిన చెరువు కట్టకు పొడవునా పగుళ్లుబారాయి. మండలంలోని బండపల్లి ఊర చెరువును మినీ రిజర్వాయర్‌గా నిర్మాణాన్ని 2014లో పూర్తిచేశారు. మూడు నాలుగేళ్లుగా చెరువు కట్టపై భారీ గుంతలు ఏర్పడి మోకాలు లోతు గుంతల్లో నీరు నిలిచింది. నిర్మాణ సమయంలో సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతో పగుళ్లు బారుతున్నాయన్న అభిప్రాయం రైతులనుంచి వ్యక్తమవుతోంది. వానాకాలంలో భారీ వర్షాలు పడితే కట్ట కొట్టుకుపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. కాలువలు, ఉప కాలువల నిర్మాణాలు ఎక్కడిక్కడే కూలిపోయాయి. దీంతో యాసంగిలో కాలువల ద్వారా సాగునీరు ఎలా అందుతుందని ఆందోళన చెందుతున్నారు. వినియోగంలోకి రాకముందే ఎక్కడిక్కడే పగుళ్లు బారి శిథిలావస్థకు చేరుకున్న ఎల్లంపల్లి కాలువలపై కథనం.

కొరవడిన నాణ్యత

వేములవాడ నియోజకవర్గంలోని 98 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2008లో మల్యాల శివారులో ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం రెండో విడతల్లో రిజర్వాయర్, పైప్‌లైన్, కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. బండపల్లి (ఊర చెరువు) పనులకు భూసేకరణ పూర్తిచేసి పనులు చేపట్టే వరకు నాలుగేళ్లు గడవగా పనులు పూర్తి చేసేందుకు ఐదేళ్లు పట్టింది. టెండర్లు దక్కించుకున్న కంపెనీలు పనిచేయకుండా సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేశారన్న ఆరోపణలున్నాయి. దీంతో పనులు పూర్తయిన ఏడాదిలోపే కాలువలు, నిర్మించిన గైడ్‌వాల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. రూ. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులన్నీ ప్రయోజనం లేకుండా పోయింది.

అధ్వానంగా కాలువల గైడ్‌వాల్స్

బండపల్లి ఊర చెరువును మినీ రిజర్వాయర్‌గా ఆధునీకరించారు. చెరువు ద్వారా 2,750 ఎకరాలకు సాగునీరిందించేందుకు కుడి కాలువల ద్వారా బండపల్లి, బావుసాయిపేట, మామిడిపల్లి, బొల్లారం వరకు 7కిలోమీటర్ల కాలువను నిర్మించగా ఎక్కడికక్కడే కూలిపోయాయి. ఎడమ కాలువల ద్వారా బండపల్లి, కిష్టంపేట, ఎన్గల్, హన్మాజీపేట దాకా ఆరుకిలో మీటర్ల వరకు నిర్మించారు. నిర్మించిన రెండేళ్లకే కాలువలు, గైడ్ వాల్స్ పగుళ్లుబారి కూలిపోయాయి. నిర్మాణ సమయంలోనే పగుళ్లు రాగా సబ్ కాంట్రాక్టర్ కప్పిపుచ్చుకునేందుకు జాగ్రత్త పడ్డారని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

కాలువల నిండా ముళ్లపొదలు

సాగు నీరందించేందుకు నిర్మించిన కాలువలన్నీ ముళ్ల పొదలతో నిండాయి. ఐదేళ్లుగా వాటి నిర్వహణను పట్టించుకునే వారు లేరు. కొందరు రైతులు కాలువ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటుండగా, మరికొందరు కాలువల్లో మట్టి నింపి దారులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో బండపల్లి రైతులకే పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదని వాపోతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



గతేడాది నుంచి చెరువు కట్ట పగుళ్లు, నెర్రెలు బారుతుంది. వానాకాలంలో వాటిలోకి నీరు చేరి కట్ట కోతకు గురయ్యే అవకాశం ఉంది. ఏడాదిగా మరమ్మతులు చేపట్టాలని కోరినా పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా మరమ్మతులు చేయాలి

– న్యాత దినకర్, రైతు, బండపల్లి

నిర్మించినా ప్రయోజనం లేదు



కాలువలు నిర్మించి ఐదేళ్లయినా ఒక్కరోజు సాగునీరు రాలేదు. కాలువ నిర్మాణంతో పంటలకు నీరందుతుందని అనుకున్నా. కాలువ మొత్తం ముళ్ల పొదలతో నిండిపోయింది. కొన్ని చోట్ల కూలిపోయాయి. ఇప్పటికైనా కాలువలు నిర్మించి సాగునీరందించాలి.

– గడ్డం అంజిరెడ్డి, రైతు, బండపల్లి

మరమ్మతులు చేపడుతాం



బండపల్లి చెరువు కట్టపై రాత్రిపూట ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నట్లు తెలిసింది. దీంతో కట్ట పగుళ్లు బారి నెర్రెలు తెరుస్తోంది. రెండ్రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయిస్తాం. శిథిలావస్థ కాలువలకు త్వరలో మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సంతు ప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్టు

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి



తంగళ్లపల్లి: ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి



గంభీరావుపేట: అవగాహన కల్పిస్తున్న ఏఈవో అనూష

చందుర్తి: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి దుర్గరాజు అన్నారు. మండలంలోని రామారావుపల్లె, రామన్నపేట, తిమ్మాపూర్, కొత్తపేటలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ విత్తనాలను లైసెన్స్ ఉన్న అధీకృత దుకాణాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. పంటచేతికొచ్చే వరకు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు రసీదులను భద్రపర్చుకోవాలన్నారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్, రాగట్లపల్లి, బుగ్గ రాజేశ్వరతండా, పోతిరెడ్డిపల్లి, సింగారంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. ఏఈవోలు ముకుంద్‌కుమార్, లక్ష్మణ్, శ్రీశైలం, మసూద్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని ఏఈవో విజయ్ సూచించారు. మండలంలోని దేగావత్ తండా, అడ్డబోర్ తండాలో రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. మానాల క్లస్టర్ ఏఈవో విజయ్, ఇరుగ్రామాల రైతులు బానోతు రాజు, రమేష్, దశరథ్, నర్సింగ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: రైతులు లైసెన్స్ కలిగి ఉన్న విత్తన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఎంఏవో ప్రణీత పేర్కొన్నారు. మండలంలోని బూర్గుపల్లి, గుండన్నపల్లి, రత్నంపేట, వెంకట్రావుపల్లి, మల్లాపూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. వరి పొలాలు కోసిన తర్వాత వరి కొయ్యలు కాల్చవద్దని సూచించారు. ఆయిల్ పామ్ పంటల సాగు, రాయితీ గురించి రైతులకు వివరించారు. సమావేశంలో ఏఈవోలు శ్రీదేవి, రవళి, సాహితి, అనూష పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి సందీప్ హెచ్చరించారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, విక్రయ రసీదులను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు అభిషేక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు రసీదులు తీసుకోవాలని గంభీరావుపేట ఏఈవోలు అనూష, సాయి, రాకేశ్, ప్రవీణ్ సూచించారు. రైతువేదికల్లో రైతులకు విత్తనాల కొనుగోలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వీర్నపల్లి: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని రంగంపేట, బాబాయి చెరువుతండాల రైతులకు అవగాహన కల్పించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు మోసపోవద్దన్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా బాల్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న బాల్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా మండలకేంద్రానికి చెందిన బండారి బాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాల్‌రెడ్డితో పాటు మండలంలోని బండలింగంపల్లికి చెందిన తడుకల దేవరాజును జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు అగ్గిరాములు బుధవారం తెలిపారు. వీరికి నియామకపత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అందజేశారు. అనంతరం ఇద్దరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నియామకం



చందుర్తి: మున్నూరు కాపు సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మండలంలోని కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవారి రమేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య చేతులమీదుగా బుధవారం అందుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోంచెట్టి శంకర్ తదితరులున్నారు.

ముక్కు మూసుకొని పోవుడే..



నర్మాల రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

- రోడ్డుపక్కనే పేరుకుపోయిన చెత్త
- పట్టించుకోని అధికారులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యానికి ప్రాముఖ్యత ఇస్తున్నామని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నారు. నివాసాల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలు ఉపాధిహామీ పథకంలో నిర్మించిన డంపింగ్‌యార్డులకు చేరడం లేదు. చెత్త తరలింపునకు గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లు సమకూర్చారు. తడి, పొడి చెత్తనుంచి డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉంది. కానీ గ్రామాల్లో ఈ విధానం అటకెక్కింది. చెత్తాచెదారం, వ్యర్థాలు రోడ్లపైనే పేరుకుపోతున్నాయి. పందులు, కుక్కలు వాటిలో బొర్లడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వాహనదారులకు అవి అడ్డురావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అక్కడే చెత్తకు నిప్పంటించడంతో పొగతో ప్రయాణికులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. మరికొన్ని చోట్ల డంపింగ్ కేంద్రాల పక్కనే కాలుస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి. అధికారులు స్పందించి డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకువచ్చి సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టిసారించాలని, చెత్తాచెదారం, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో తాగునీటి పైపులు మురుగుకాలువల్లోనే ఉంటున్నాయి. దీంతో మురుగునీరు తాగునీటి పైపుల్లోకి వెళ్తుండగా గ్రామస్తులు ఆనీరు తాగి అనారోగ్యం బారినపడుతున్నారు. పలుసార్లు గ్రామస్తులు అధికారులు, గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రత్యేకాధికారి కనీసం నెలలో రెండుసార్లు అయినా గ్రామానికి రావడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు నిధులు లేవని అధికారులు దాటవేస్తున్నారు. కలెక్టర్ తగు చర్యలు తీసుకొని తాగునీటి పైపులైన్లకు మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన నీరు అందించాలని కోరుతున్నారు.



రాచర్ల బొప్పాపూర్‌లో మురుగుకాలువలో ఉన్న తాగునీటి పైపులు



లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి.!

వేములవాడఅర్బన్: ప్రజల నిత్యవసర సరుకులతో పాటు కూరగాయలు, ఇతర వస్తువుల కొనుగోలు చేసేందుకు వేములవాడ మండలం చింతాల్‌ఠాణాలో ఏర్పాటు చేసిన గ్రామసంత నిరుపయోగంగా మారింది. సుమారు మూడేళ్ల క్రితం ప్రభుత్వ భూమి ఎకరం విశాలమైన స్థలంలో పార్కింగ్‌తో కూడిన గ్రామసంతను ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 10 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.8లక్షలతో గ్రామసంత ఏర్పాటు చేశారు. ఈ సంతలో 34 షాపులు ఉన్నాయి. అన్ని హంగులతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. కానీ అందులో ఏరోజు సంత జరిగింది లేదు. చింతాల్‌ఠాణా మధ్యమానేరు ముంపు గ్రామం కావడంతో నిర్వాసితులకు ఉపాధి దొరుకుతుందని గ్రామసంత ఏర్పాటు చేయగా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం సంత ముందు ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ప్రభుత్వ నిధులు రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన సంతను గాలికొదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారానికోసారి గ్రామసంత జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలం’



మాట్లాడుతున్న మృత్యుంజయం

గంభీరావుపేట: ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు విఫలమవుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా క్షేత్రస్థాయిలో వ్యవహరిస్తున్నారన్నారు. పల్లెల్లోనూ రూ. 4వేలు చెల్లిస్తే తప్ప ట్రాక్టర్ ఇసుక లభించని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సొంత అవసరాలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారులు ట్రాక్టర్ యజమానులతో కుమ్మక్కై ఇసుక ధరలను పెంచుతున్నారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు వెంటనే స్పందించి మండల పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారుల పని తీరుపై సమీక్ష జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

‘ఆది’ని కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: దుబాయి పర్యటన ముగించుకొని వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బుధవారం మండల మున్నూరుకాపు సంఘం నాయకులు వేములవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిని శాలువాతో సత్కరించారు. గల్ఫ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు శ్రీ రాజరాజేశ్వరస్వామిని నాయకులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నంది కిషన్, బండారి బాల్‌రెడ్డి, గుర్రం రాములు, ఉప్పుల రవి, మెడిశెట్టి రాజు తదితరులున్నారు.

‘పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి’

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారత్ – నేపాల్ సరిహద్దు ప్రాంతంలో బుధవారం నిర్వహించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఫెడరేషన్ ఉపాధ్యాయులు పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాలను సందర్శించి అక్కడ ఆవిర్భావ వేడుకలు జరిపామన్నారు. ప్రభుత్వం బడులు ప్రారంభయ్యే నాటికి పారిశుధ్య కార్మికులను నియమించాలని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లులను మంజూరు చేసి విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మహిళా కార్యదర్శి మాలతి, సిరిసిల్ల మండల అధ్యక్షుడు రాజేందర్, సీనియర్ నాయకులు విద్యాసాగర్, రవీందర్, కేజీబీవీ జిల్లా కన్వీనర్ సుధారాణి, మైనారిటీ వింగ్ బాధ్యురాలు స్వప్న, కీర్తి, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

నాటుతూ.. నరికేస్తున్నారు



రుద్రంగి: గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా గ్రామాల్లో రోడ్లపక్కన మొక్కలు నాటారు. విద్యుత్ వైర్ల కింద నాటడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సిబ్బంది చెట్లను నరికివేస్తున్నారు. రూ.లక్షలాది రూపాయలతో మొక్కలు నాటగా ఏపుగా పెరిగిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యంతో వాటిని నరికివేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో జాగ్రత్తలు పాటించి విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటకుండా ఉండాలని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

సద్గుణాచారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న సద్గుణాచారి

ముస్తాబాద్: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన రాజూరి సద్గుణాచారి బుధవారం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ‘విశ్వకర్మ లెజెండరీ–2024 అవార్డు అందుకున్నారు. వాస్తు జ్యోతిష్య రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారం అందజేశారు. పౌరోహిత్యంపాటు వాస్తు, జ్యోతిష్యశాస్త్రంలో ముప్పై ఏళ్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సేవలు అందిస్తున్నారు. అవార్డు అందుకోవడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి, తల్లోజు ఆచారి, లక్ష్మీ నారాయణ, కాళీదాస్, నీలిమ, రంగబాబు, జితేంద్ర, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.